క్లుప్తంగా

'గేట్స్' విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. వివరాలు.. గుంటూరులోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ బూట్ క్యాంప్ లో గేట్స్‌లో సెకెండియర్ చదువుతున్న తిలక్, ముజమ్మిల్, మనోభిరం, అక్మల్, థర్డ్ ఇయర్ చదువుతున్న రేవంత్ ప్రతిభ కనబరిచారు. బూట్ క్యాంప్‌లో దేశ వ్యాప్తంగా 12 నోడల్ సెంటర్ల నుంచి ఆరు వేల మందికి పైగా విద్యార్థులు హాజరైయ్యారు. ఇందులో గేట్స్ విద్యార్థులు టాప్-5లో స్థానం సంపాదించారు. బూట్ క్యాంప్‌ను ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా నిర్వహించారు. వీరు గేట్స్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం గేట్స్ కాలేజీలో జాతీయ స్థాయి బూట్ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, కో-ఆర్డినేటర్ ఖయ్యూమ్, ఏఓ ఇంతియాజ్ తదితరులు అభినందించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

యాడికి: ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. కొంతకాలంగా తాడిపత్రి మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ఆదిమూలం వెంకటరమణ టిప్పర్‌లోతాడిపత్రి మండలం నుంచి ఇసుకను తరలిస్తున్నాడనే సమాచారం రావటంతో ఎస్ఐ మంగళవారం సిబ్బందితో కలసి దాడిచేశారు. యాడికి మండలంలోని రాయలచెరువు క్రాస్ వద్ద టిప్పర్‌ను పట్టుకుని పోలీస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ ప్రతిభ



విమలారాణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని శంకరనంద గిరిస్వామి కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ ముండ్ల విమలారాణి పాల్గొని జాతీయ సమైక్యత శిబిరంలో వివిధ అంశాల్లో ప్రతిభను చాటింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్ శివాజీ విశ్వ విద్యాలయంలో యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గత 16వ తేదీ నుంచి 22 తేదీ వరకూ జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించారు. శిబిరంలో కళాశాలకు చెందిన విమలారాణి పాల్గొని ప్రతిభను చాటింది. దీంతో మంగళవారం స్థానిక కళాశాలలో విద్యార్థినిని అభినందించి ప్రశంసా ప్రతాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి నత్యప్రదర్శన ద్వారా సంస్కృతి సాంప్రదాయాలు, జీవనశైలి గురించి చక్కగా ప్రదర్శించి ప్రశంసలు అందుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు శివయ్య, నాగార్జున, కళాశాల ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

గుంతకల్లు: ఇతరులకు సహాయం చేయడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఐడీబీఐ బ్యాంకు అధికారులు స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు బీరువా వితరణ చేశారు. బ్యాంకు 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బీరువా అందజేసినట్లు బ్యాంకు మేనేజర్ హరీష్ గారి సోమన్న తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాశీనాథ్, ఉపాధ్యాయులు దీప్తి, కె.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్ల పరిశీలన



శింగనమల సీహెచ్‌సీలో దివ్యాంగుల పింఛన్లను పరిశీలిస్తున్న వైద్యులు

శింగనమల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం దివ్యాంగుల పింఛన్లను వైద్యుడు సుబ్బరాయుడు పరిశీలించారు. వారంలో మూడు రోజుల పాటు 50 పింఛన్ల చొప్పున పరిశీలిస్తున్నట్లు వైద్యుడు తెలిపారు. ఈ ప్రక్రియ జూలై వరకూ కొనసాగుతుందన్నారు. ఆయన వెంట సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు హరిణి, అరుణ్ ఉన్నారు.

అధికారంలోకి రాగానే నూతన పింఛన్లు మంజూరు చేసి అర్హులందరికీ న్యాయం చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ప్రచారంలో ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా హామీల అమలుపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. దీంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



కొత్త రేషన్ కార్డులు ఎప్పుడో?

- ఎదురు చూస్తున్న పేద ప్రజలు
- గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

గార్లదిన్నె: కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో అని అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల కోసం రోజూ గ్రామ సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా కొత్త రేషన్ కార్డుల మంజూరుపై ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వందల సంఖ్యలో పేద ప్రజలు నూతన రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం జరిగేది. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులతోపాటు కొత్తగా పెళ్లైన వారికి రేషన్ కార్డు అవసరం. ఇప్పటి వరకూ కుటుంబానికి ఉన్న వారిని రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగిం చేందుకు స్పిట్ ఆప్షన్ కూడా లేక పోవడం,పేర్లు మార్పు, చేర్పులను చేపట్టక పోవడం, కొత్తగా పెళ్లై పుట్టింటి నుంచి అత్తగా రింటికి వెళ్లిన కొత్త కొడలికి రేషన్ కార్డు దక్కని పరిస్థితి. వివాహమై ఇంటి పేరు మారినా రేషన్ కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేయక పోవడంతో సబ్సిడీ బియ్యం అందక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకుపోతున్న దరఖాస్తులు ...

గతంలో కొత్తగా పెళ్లైన వారు తల్లిదండ్రుల కార్డుల నుంచి తమ పేర్లు తొలగించాలని దరఖాస్తు చేసుకుంటే స్పిట్ ఆప్షన్ ద్వారా సచివాలయ సిబ్బంది వెంటనే వారి పేర్లను కార్డుల నుంచి తొలగించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డు వెబ్ సైట్ పని చేయకపోవడంతో కొత్త జంట నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు రేషన్ కార్డులు మంజూరు చేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామ సచివాలయ సిబ్బందిని అడిగితే ఆప్షన్ రాలేదని సమాధానం చెబుతున్నారు. దీంతో నియోజకవర్గం వ్యాప్తంగా ఆరు మండ లాల్లో వందల మంది నూతన రేషన్ కార్డులు కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు.

కార్డు కోసం ఎదురు చూస్తున్నాం



నాకు వివాహమైనప్పటి నుంచి రేషన్ కార్డు కోసం ఆశగా ఎదురు చూస్తున్నా. గ్రామ సచివాలయం వద్దకు పలుమార్లు తిరిగినా వెబ్ సైట్ ఓపెన్ కాలే దని సిబ్బంది చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తోంది. ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి.

– మధు, ఇల్లూరు

ఉత్తర్వులు రావాల్సి ఉంది



నూతన రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం. అంతవరకు ప్రజలు ఎవ రూ కార్యాలయాలు చుట్టూ తిరగవద్దు. వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే మార్పులు, చేర్పులు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఈరమ్మ, తహసీల్దార్, గార్లదిన్నె

మహా శివరాత్రికి ఏర్పాట్లు



తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రసిద్ధ క్షేత్రం పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు మహా శివరాత్రి ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ ఎత్తున భక్తులు హాజరుకానున్న దృష్ట్యా వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాత్కాలిక క్యూ లైన్లు, ఎండవేడిమి నుంచి భక్తులకు రక్షణ చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. శివరాత్రి జాగారణనున్ని పురస్కరించుకొని సాంస్కతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏఎస్పీ రోహిత్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును నియమించారు. తాడిపత్రి సబ్‌డివిజన్ నుంచి సీఐలు, ఎస్ఐలు, 150సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు.

గ్రామాల్లో బందోబస్తు

మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని తాడిపత్రి మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెంచామని ఎస్ఐ కాటయ్య తెలిపారు. మండలంలోని ఆలూరు, బోడాయిపల్లి గ్రామాల్లో మంగళవారం తనిఖీలు చేశామన్నారు. గ్రామాల్లో శివరాత్రి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆలయంలో 'శివనామస్మరణ'

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి హనుమాన్ దేవాలయంలో వెలసిన శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని 24 గంటలు శివ నామస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంగళవారం గ్రామస్తులు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారంఉదయం 6 గంటల వరకూ అంటే 24 గంటల వరకూ శివ పంచాక్షరీ మంత్ర నామస్మరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

నేడు వేడుకలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక, కల్లూరులో బుధవారం మహా శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కల్లూరులో ఉదయం శివుడికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. అలాగే రాత్రి 8 గంటలకు వెంకీమామ కళాబృందంచే భక్తి పాటలు, హస్యభరిత సన్నివేశాలు, మ్యాజిక్ షో, చిన్న పిల్లల డ్యాన్సులు ఉంటాయన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



పులివెందుల క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌ను కలిసిన యాడికి నాయకులు

యాడికి: అలవి కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పాటుపడాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని యాడికి మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పులివెందుల పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన మాజీ సీఎంకు వివరించారు. మాజీ సీఎం జగనన్నను కలిసిన వారిలో పిన్నేపల్లి శేఖర్ రెడ్డి, జింతలాయపల్లి రోషిరెడ్డి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం



మాజీ ఎమ్మెల్యేని సన్మానిస్తున్న గుత్తి నాయకులు

గుత్తి రూరల్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. గుత్తి మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం గుంతకల్లు పట్టణంలోని వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ గంగరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు హుస్సేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వారు చర్చించారు. పార్టీ సంస్థాగతంగా పటిష్టపరిచేందుకు కమిటీల నియామకం గురించి మాజీ ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొత్తపేట, టి.కొత్తపల్లి, ధర్మాపురం, బాచుపల్లి, గాజులపల్లి, పి.ఎర్రగుడి, బ్రాహ్మణపల్లికి చెందిన రాముయాదవ్, సుధాకర్, సురేష్, రంగయ్య, ప్రసాద్, కృష్ణమోహన్‌నాయుడు, బలరాముడు, శంకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రంగస్వామి, మల్లి, బ్రహ్మేంద్రకుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు చితంబర స్వామి తిరునాల

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో గురువారం చితంబరస్వామి తిరునాల నిర్వహించనున్నారు. మంగళవారం గ్రామస్తులు మాట్లాడుతూ శివరాత్రి జాగారణ మరుసటి రోజు చితంబరస్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. అలాగే రాత్రికి చితంబరస్వామి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకోనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎండల తీవ్రతపై జాగ్రత్తలు పాటించాలి

గార్లదిన్నె: ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అసం క్రమిత వ్యాధుల నివారణ జిల్లా పోగ్రాం అధికారి డాక్టర్ నారాయణ స్వామి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాతావరణ మార్పులు, ఆరోగ్య పరిష్కారాలు అంశంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనర్ నైమిషా, పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, దిలీప్‌కుమార్, సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వర య్య, పీహెచ్ఎన్ అరుణకుమారి, వివిధ గ్రామాల ఏఎన్ఎంలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మాలధారుల ఆధ్వర్యంలో అన్నదానం

గుత్తి: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శివ మాలధారుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, శివ స్వాములు, పూజారులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్ర 3.30 గంటల వరకూ అన్నదానం చేశారు.

'విశిష్ట సంఖ్య' నమోదు గడువు పొడిగించాలి

పామిడి: సాంకేతిక సమస్యల వల్ల రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, గడువు పొడిగించాలని రామరాజుపల్లి సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి శనివారం కోరారు. రామరాజుపల్లి రైతుసేవా కేంద్రంలోని నమోదు ప్రక్రియలో నెలకొన్న సర్వర్ సమస్యను ఆయన గుర్తించారు. నమోదు ప్రక్రియకు సంబంధించి మూడు ఓటీపీలు రావాల్సి ఉండగా కేవలం రెండు ఓటీపీలే వస్తున్నాయన్నారు. తద్వారా ఈ నమోదు ప్రక్రియ గడువును పెంచాలని ఆయన గుత్తి ఏడీఏ వెంకటరాముడు, ఏఓ డీ లీనా వసుంధర దృష్టికి తీసుకువచ్చారు.

చెత్తసేకరణకు వాహనాల అందజేత

తాడిపత్రి రూరల్: మునిసిపాలిటీలో చెత్త సేకరణకు నాలుగు వాహనాలను అధికారులకు మంగళవారం మునిసిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. చెత్త సేకరణలో వాహనాల సమస్య ఉండటంతో అధికారులు గతంలో ఆయన దృష్టికి తెచ్చారు. ఈక్రమంలో ఆయన నాలుగు ఎలక్ట్రికల్ వాహనాలను అందజేశారు.

వృద్ధురాలి మృతి

పామిడి: అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రంగమ్మ(65) మంగళవారం మృతి చెందారు. ఈ నెల 11న ఎద్దులపల్లిలో జరిగిన బైకు ప్రమాదంలో రంగమ్మ గాయపడ్డ విషయం తెలిసిందే. మృతురాలు రంగమ్మ కుమార్తె ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి



గాయపడిన పరంధాముడు

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో పాత కక్షల కారణంగా పరంధాముడు అనే వ్యక్తిపై మంగళవారం దాడి జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పరంధాముడుకు అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబంతో కొన్ని నెలల క్రితం చిన్నపాటి విషయంపై గొడవలు జరిగాయి. ఈ క్రమంలో పరంధాముడు గ్రామ సచివాలయం వద్ద కూర్చొని ఉండగా పాతకక్షలను మనసులో పెట్టుకుని కొందరు వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. దాడిలో గాయపడిన పరంధాముడును బంధువులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీ, విక్రయం నేరం

తాడిపత్రి రూరల్: సారా తయారీ, విక్రయాలతో విలువైన జీవితం నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ నాయుడు సూచించారు. మండలంలోని గద్దరగుట్టపల్లిలో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, నాటు సారాకు యువత బలి అవుతున్నారన్నారు. వీటిని విక్రయించడం, తయారుచేయడం వల్ల వారి జీవితాలను పతనం చేయడమే కాక కేసులు, జైలు శిక్షలను అనుభవించాల్సి వస్తుందన్నారు. వాటి నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ సుధాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల సమగ్రాభివృద్ధే లక్ష్యం



యాడికిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి



తాడిపత్రిలో ట్రైనింగ్‌కు హాజరైన అంగన్‌వాడీ టీచర్లతో ఎంఈఓ తదితరులు

యాడికి/తాడిపత్రిరూరల్/పెద్దవడుగూరు: అంగన్‌వాడీ చిన్నారులకు విద్యతో పాటు వారి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి సూచించారు. మంగళవారం యాడికిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారుల విద్యను ఏ విధంగా బలోపేతం చేయాలనే అంశంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్-120 ట్రైనింగ్ ముగిసింది. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, రామగోవిందరెడ్డి, హెచ్ఎం రంగనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దస్తగిరిమ్మ, కల్పన, విజయ పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన అంగన్‌వాడీల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ రాముడు, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, శంషాద్‌బేగం, హెచ్ఎం సుధాకర్‌బాబు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీల కట్టడికి డ్రోన్లతో నిఘా

తాడిపత్రి రూరల్: రైళ్లలో దొంగతనాలు జరగకుండా జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప ఆధ్వర్యంలో మంగళవారం డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశారు. కోమలి, వంగనూరు రైల్వే స్టేషన్ సమీపంలో డ్రోన్‌ల ద్వారా నిఘా పెంచారు. డ్రోన్‌ల ద్వారా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. దోపిడీలకు ఎలాంటి అవకాశం లేకుండా రైల్వే దొంగలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఆయా రైల్వే స్టేషన్లల్లో అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారణ చేశారు.

బాలికలు స్వీయరక్షణ పద్ధతులు పాటించాలి



బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: బాలికలు స్వీయ రక్షణ పాటిస్తూ జాగ్రత్తగా మెలగాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీస్ ఆధ్వర్యంలో బాలికలకు స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు స్వీయ రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే కిశోరి వికాసం ద్వారా బాలికలు కరాటే నేర్చుకోవాలన్నారు. అనంతరం బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి రమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే, వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గం ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి ఉపవాస పూజలను నిర్వహించే భక్తుకు ఆ దేవదేవుడి ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలన్నారు. ప్రజలకు సుఖసంతోషాలు, శాంతిని ప్రసాదించాలని ఆ మహాశివుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని పురాతన కాశీ విశ్వేశ్వరాలయంలో మాఘ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని శివ పార్వతుల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణ , వేణు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి విశిష్టతపై అవగాహన

గుంతకల్లు రూరల్: శివరాత్రి అంటే మోక్షరాత్రి అని, ప్రతి ఒక్కరూ మోక్షం పొందాలన్నదే పండుగ ముఖ్య ఉద్దేశమని త్రైతసిద్ధాంత భగవద్గీత సభ్యులు తెలిపారు. త్రైతసిద్ధాంత భగవద్గీత సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వైటీ చెరువు గ్రామంలో శివరాత్రి విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి పండుగ విశిష్టత, శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ముగిసిన భాగవత సప్తాహం

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో గ్రామ పెద్దలు , ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన భాగవత సప్తాహం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వారం రోజులుగా ఆలయంలో కూచివారిపల్లి భాగవత సమాజం వారిచే నిర్వహించిన భాగవత సప్తాహ కార్యక్రమం ముగియడంతో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


గురుకుల పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు



ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న లాయర్ ప్రతాప్‌రెడ్డి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం,మైనార్టీ గురుకుల పాఠశాలలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈఓ ఎంవీ రావు రూ.1.71 లక్షలు సొంత నిధులతో విద్యార్థుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో మంగళవారం లాయర్ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్లాంట్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంవీరావుకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకుడు తాతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులకు బహుమతులు



పోస్టల్ అసిస్టెంట్ సురేష్ గౌడ్‌కు బహుమతి అందజేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న హెడ్ పోస్టాఫీస్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. మావేశానికి గుంతకల్లు డివిజన్ పరిధిలోని బీపీఎంలు, ఏబీపీఎం లు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్య సాధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్టల్ ఉద్యోగులకు డివిజన్ తపాలా సూపరింటెండెంట్ గుంపుస్వామి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ విజయ భాస్కర్, పోస్ట్ మాస్టర్ రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.